విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 17 సెప్టెంబర్ 2024 8 పేజీలు

సాగర్ జలాల్లో జిల్లా వాటాను సాధించాలి

నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావాల్సిన వాటా నీటిని సాధించాలని రైతుల సంఘాల నాయకులు కోరారు. మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని సోమవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంప్ ఆఫీసులో కలిసి వినతిపత్రం అందజేశారు. సంయుక్త కిసాన్ మోర్జా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు గేట్లను పెట్టించటంలో వేగం పెంచాలని, రబీ సాగుకు సాగర్ జలాలతో రిజర్వాయర్ నింపితే రైతులకు ఉపయోగకరమని, పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు రిజర్వాయర్ పథకం పూర్తిచేయించాలని కోరారు.

– విశాలాంధ్ర, ఒంగోలు 2లో

- ఆరుతడి పంట, వరి సాగుకు తప్పనిసరిగా నీరిందించాలి
- గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లను వెంటనే పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి స్వామికి వినతి పత్రం అందజేసిన రైతు సంఘాల నేతలు
- రైతాంగ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి

లంక గ్రామాలకు సీపీఐ బాసట

విశాలాంధ్ర బ్యూరో – బాపట్ల :

కర్షక కార్మిక శ్రామిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పోరాటాలు ఉద్యమాలు చేసే సీపీఐ వరద బాధితులకు బాసటగా నిలిచింది. ఇటీవల వరద ముంపునకు గురై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న బాపట్ల జిల్లా లంక గ్రామాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ జాతీయ కౌన్సిల్ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండలు సోమవారం వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం లంక గ్రామాల్లో వరద ముంపుకు గురైన ప్రాంతాలు పరిశీలించి జరిగిన నష్ట పరిస్థితులపై ఆరా తీశారు. బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఆధ్వర్యంలో వరద ముంపు బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాలతో పశువుల దాణా కొనుగోలు చేసి ఆవులవారిపాలెంలో 60 కుటుంబాలకు దాణాలు అందజేశారు. భారీ వర్షాలు వరదల కారణంగా నష్టపోయిన పాడి పశువుల రైతులకు పశుగ్రాసం అందించటమే తక్షణ చర్యగా పాడి పశువుల రైతులకు పశువుల దాణా బాపట్ల జిల్లాలోని వరద బాధితులకు అందజేయడం జరుగుతుందని రామకృష్ణ అన్నారు. భారీ వర్షాలు వరదల కారణంగా పంటలతో పాటు నోరులేని మూగజీవాలకు పశుగ్రాసం కరువైందని లంక గ్రామాల్లో పర్యటించి పశువులకు పశువులకు దాణా అందించడానికి సీపీఐ పార్టీ నడుం బిగించిందని ఆయన వివరించారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు వరదల కారణంగా కొల్లూరు మండలం ఆవులవారిపాలెం లంక గ్రామాలలో రైతులు పశువుల కోసం భద్రపరుచుకుని ఏర్పాటు చేసుకున్న వరిగడ్డి వాములు వరద దాటికి కొట్టుకు పోయాయని రైతులు సనక శ్రీనివాసరావు, ఆత్మకూరు సుబ్బారావు, బండి వెంకట శేషు, వేముల సందీప్, సంక సాంబశివరావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు ఆహారం కొరకు బియ్యం దొరుకుతున్నాయి గాని, పశువులకు ఎండు గడ్డి లేక, పశుగ్రాసం దొరకక తమ పశువులను చౌక బేరానికి విక్రయించడం జరుగుతుందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సీపీఐ నాయకులు మా మొర ఆలకించి ప్రతి పాడిపశువుల రైతు కుటుంబాలకు 60 కట్టల పశువుల దాణా కట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బావి రెడ్డి ప్రభాకర్ రావు, వరద బాధిత రైతు కుటుంబాలు పాల్గొన్నారు.

దాణా బ్యాగులు అందజేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అక్కినేని వనజ, జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య

ప్రశ్నించే వారికి వైసీపీలో మనుగడ లేదు

ఆరోగ్యశ్రీ మాజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్

ప్రశ్నించే వారికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మనుగడ లేదని ఆరోగ్యశ్రీ మాజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు, నాగులుప్పలపాడు జడ్పీటీసీ డాక్టర్ రత్న భారతిలు ధ్వజమెత్తారు. ఒంగోలులోని డాక్టర్ అశోక్ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ నా ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంటూ జగన్ పార్టీ ఆచరణలో దళితులను తీవ్రంగా మోసం చేసిందన్నారు.

–విశాలాంధ్ర, ఒంగోలు 2లో

వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు

దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే బుచేపల్లి శివప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు అక్రమకేసులు పెట్టి వేదిస్తున్నారని దర్శి నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ బుచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. కురిచేడు మండలం దేకనకొండ గ్రామానికి చెందిన 21మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను టి.డి.పి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టీ దర్శిలో జైల్ పాలు చేసారని అన్నారు. పార్టీ కార్యకర్తలను దర్శి శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పరా మర్శించి వారికి ధైర్యం చెప్పి మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జైల్ బయట వున్న వారి కుటుంబ సభ్యులకు కూడా ధైర్యం చెప్పి మీకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాట్లాడుతూ 100రోజుల టిడిపి పాలనలో ప్రజా సమస్యలను మరచి వైసీపీ కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేసుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్యకర్తలకు అండగా ఉండి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని అన్నారు.

టీడీపీలో రెండో గ్రూపు లేదు

గూడూరి ఎరిక్షన్ బాబు వెల్లడి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : నాలుగేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డాను.. పార్టీ నాకు మంచి ప్రోత్సాహం ఇచ్చింది. 2019 ఎన్నికల్లో 32 వేల మెజారిటీతో వైసీపీ గెలిస్తే.. 2024 ఎన్నికల్లో ధీటుగా ఎదుర్కొని స్వల్ప మెజారిటీతో ఓటమి చెందటం జరిగింది. అయినా ప్రజల కోసం నిలబడ్డాను. ఎంతకాలమైన ఈ ప్రాంత ప్రజల కోసం పనిచేస్తా పార్టీ క్యాడర్కు అండగా ఉంటాను. టీడీపీలో రెండో వర్గం అనేది లేదు. పార్టీ క్యాడర్ అంతా నాతోనే ఉంది. అలా దుష్ప్రచారం చేస్తున్నారు. యర్రగొండపాలెంలమ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాని యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. సోమవారం ఆయన 'విశాలాంధ్ర' ప్రతినిధితో మాట్లాడారు. యర్రగొండపాలెం టీడీపీలో వర్గ పోరు లేదని, టీడీపీ లో ఉండి వైసీపీకి మద్దతు పలికే కొందరి వల్ల సమస్యలు వచ్చాయని ఒక ప్రశ్నకు సమాధానంగా ఎరీక్షన్ బాబు అన్నారు. టీడీపీ క్యాడర్ అంతా బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్తాయి నాయకులు అందరూ నాతోనే ఉన్నారని, పార్టీ తనను గుర్తించి అప్పగించిన పనిని బాధ్యతగా చేస్తూ ప్రజల కోసం ముఖ్యంగా పార్టీ కార్యకర్తలకోసం పని చేస్తానని అన్నారు. ఇటీవల మురారిపల్లెలో నీళ్లట్యాంక్ వివాదం కూడా అసత్య ప్రచారం అని ఆయన కొట్టిపారేశారు. ఇక్కడ పార్టీ క్యాడర్ క్రమశిక్షణతో పార్టీ నియమాలకు కట్టుబడి ఉంటుందని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ జనసేనలో చేరుతారనే ప్రచారం వల్ల తమకు ఎటువంటి నష్టం వాటిల్లదని, టీడీపీ కోసం తాను నాలుగేళ్లుగా చేసిన కృషి, ఆర్థికంగా ఇక్కడ నష్టపోయిన పరిస్థితి అంతా పార్టీ అధినేత చంద్రబాబుకు, లోకేష్‌కు తెలుసని అన్నారు. ఇటువంటి ప్రచారాలను పట్టించుకోవద్దని చెప్పారు.

కష్టపడ్డవారికి పదవులు : కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుందని అటువంటి వారికి నామినేటెడ్ పదవులు వస్తాయని ఆయన అన్నారు. పార్టీ వద్ద నాయకుల పరిస్థితి పై సర్వే వివరాలు ఉన్నాయని ఇక్కడ నుంచి ప్రతిపాదనలు వెళ్ళినప్పటికి అక్కడ ఉన్న నివేదిక ఆధారంగా సీఎం, పార్టీ పెద్దలు పదవులు నిర్ణయిస్తారని చెప్పారు.

యర్రగొండపాలెం అభివృద్ధిపైనే దృష్టి : యర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధి తన ప్రధాన ధ్యేయమని, ఎక్కడ కూడా అవినీతికి తావు లేదని చెప్పారు. త్రిపురాంతకం, పుల్లల చెరువు మండల కేంద్రాలకు ప్రధాన రోడ్ల అభివృద్ధి పై ద్రుష్టి పెట్టామన్నారు. త్రిపురాంతకం అమ్మవారి శాల వద్ద వంతెన, ఎస్. ఎస్ ట్యాంక్ ఏర్పాటు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. యర్రగొండపాలెం, దోర్నాలలో ఉన్నత విద్య కళాశాలలు, హాస్టల్‌ల ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. అమానిగుడిపాడులో కూడా హాస్టల్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

సాగర్ జలాల్లో జిల్లా వాటాను సాధించాలి

- రాష్ట్ర మంత్రి స్వామికి వినతి పత్రం అందజేసిన రైతు సంఘాల నేతలు
- సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి

విశాలాంధ్ర- ఒంగోలు : నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావలసిన వాటా నీటిని సాధించడంతోపాటుగా జిల్లాలో వరి సాగుకు నీరందించాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామిని జిల్లాకు చెందిన రైతు సంఘాల నాయకులు కోరారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని రైతు సంఘాల నాయకులు కలిసి రైతాంగ సమస్యలపై వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లను పెట్టించటంలో వేగం పెంచాలని, రబీ సాగును దృష్టిలో ఉంచుకొని సాగర్ జలాలతో రిజర్వాయర్ నింపాలని కోరారు. శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు రిజర్వాయర్ పథకం పూర్తి చేయుటకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, సహాయ పునరావాసం పై దృష్టి సారించాలని కోరారు. కొండేపి నియోజకవర్గ పరిధిలోని మండలాలు నాగార్జునసాగర్ కుడి కాలువతో గాని, వెలిగొండ రిజర్వాయర్ పథకం తో గాని అనుసంధానింప పడలేదన్నారు. ఆయకట్టు కల్పింపబడలేదన్నారు.

ఈ ప్రాంతాలకు తగు న్యాయం చేయడానికి, వాగులను జీవ నదులుగా మార్చేందుకు, పుష్కలంగా వేలాది ఎకరాలకు నీరు అందించేందుకు ముసి, పాలేరు వాగులపై హనుమంతరావు టెక్నాలజీ చతుర్విధ జల ప్రక్రియ అమోఘంగా ఉపయోగపడుతుందన్నారు. స్వల్ప కాలంలో, స్వల్ప నిధులతో సకారం అయ్యే ఈ విషయంపై మంత్రి దృష్టి సాధించాలని కోరారు. ఖరీఫ్ కాలం ముగిసి, అక్టోబర్ నుండి రబీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తరపున జిల్లాలో అధికారిక సమావేశం 'కడా'ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పాటికే సాగైనా వరి పంటకు నీరు అందించాలని కోరారు. కడా సమావేశానికి జిల్లాలోని రైతు సంఘాలతో పాటు, రైతులను, ప్రజా సంఘాలను కూడా ఆహ్వానించాలని, సాగునీటి శాఖ అధికారులను అప్రమతత్తం చేసేందుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. అలాగే పొదిలి పెద్ద చెరువుకు పైపులైన్ ద్వారా సాగర్ నీటిని మళ్ళించే పథకం మధ్యలో ఆగిపోయిందని, దానిని పూర్తి చేయించి ఆ ప్రాంత ప్రజల దాహోర్తి తీర్చాలని ఈ సందర్భంగా కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే 'కడా 'సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, సమావేశానికి రైతు సంఘాల నాయకులతో పాటు, రైతులను, ప్రజా సంఘాల నాయకులను కూడా పిలవాలని ఈ సందర్భంగా అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఒంగోలు నగర అధ్యక్షురాలు తురకపల్లి నాగలక్ష్మి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, విప్లవ రైతు సంఘం జిల్లా కన్వీనర్ బి సుబ్బారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.కె మాబు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలవరపు వెంకటరామయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంత్ బాబు,ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుధాకర్ రావు, రైతు సంఘం నాయకులు మండవ శ్రీనివాసరావు, వి వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారికి వైసీపీలో మనుగడ లేదు

ఆరోగ్యశ్రీ మాజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్

విశాలాంధ్ర- ఒంగోలు : నా ఎస్సీ, నా ఎస్టి, నా బీసీ అంటూ ఎల్లప్పుడూ ప్రసంగాలలో ప్రచారం చేసుకునే జగన్ పార్టీ, ఆచరణలో మాత్రం ఎస్సీ, ఎస్టి, బీసీలకు ద్రోహం చేసే పార్టీ అని ఆరోగ్యశ్రీ మాజీస్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు, నాగులుప్పలపాడు మండలం జడ్పిటిసి డాక్టర్ రత్న భారతిలు ధ్వజమెత్తారు. ఒంగోలులోని డాక్టర్ అశోక్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యాదవ అశోక్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ నిధులు మొత్తాన్ని రాష్ట్ర మంత్రులు, అధికారులు, హాస్పిటల్‌ల యాజమాన్యాలు దోచుకుతిన్నా యన్నారు. పేదవారికి సక్రమంగా ఈ పథకం చేరువ కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదవారికి ఈ పథకాన్ని చేరవేసేందుకు తిరిగి ఎంత ప్రయ త్నించినా సఫలం కాలేదన్నారు. ఏ హాస్పిటల్ కి వెళ్లిన ఫలానా మంత్రికి ప్రతి నెల మామూలు పంపిస్తున్నామని, ఫలానా అధికారికి వారి వారి ఆమ్యాలు ముట్టుతున్నాయని, హాస్పిటల్ నుండి వెళ్లిపోవాలని, లేనిపక్షంలో మీ పదవికే ముప్పు వస్తుందని బెదిరించే వారిని వాపోయారు. వీటన్నిటిపై ప్రభుత్వ సమావేశాలలో ప్రశ్నిస్తే తనని సమావేశాలకు రానీకుండా చేశారన్నారు. కేవలం బొమ్మలాగా చూస్తూ కూర్చోవాలని, వచ్చే జీతంతో ఆనందించాలే తప్ప ప్రశ్నించకూడదని హేతవు పలికారు అన్నారు. వైద్యం గురించి ఏమి తెలుసని విడుదల రజినీకి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పదవి ఇచ్చారు తనకి ఇప్పటికీ తెలియటం లేదన్నారు. మామూళ్ల వసూళ్లు తప్ప విడుదల రజనీకి తన శాఖపై ఎటువంటి పట్టు లేదన్నారు. అలాగే సీఎంఒ కార్యాలయంలో పనిచేసే హరికృష్ణ, మరి కొందరి అధికారుల పెత్తనం ఆరోగ్యశ్రీపై సాగిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలోనే కొనసాగుతున్నామన్నారు. ఇడుపులపాయ నుండి ఇచ్చాపురం వరకు జగన్ పాదయాత్రలో తోడుగా నిలిచాను అన్నారు. అందుకే తనకు ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ గా పదవి ఇచ్చారని, తన భార్యకు నాగులుప్పలపాడు మండల జడ్పిటిసి పదవి ఇచ్చారని నాయకులు చెప్పేవారన్నారు. అంతకు మించి ఆ పార్టీలో తమకి ఒరిగిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే పదవికి స్థానికంగా ఉండేవాళ్లు పోటీ చేసేందుకు పనికిరారా ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో గెలవలేని వాళ్ళని ఇతర నియోజకవర్గాలలో నిలిపితే ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. అనాలోచిత సీట్ల పంపకం వల్లే వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా నామరూపము లేకుండా పోయిందన్నారు. అయినప్పటికీ పార్టీలో ఎందుకు ఓడిపోయామని ఇప్పటికీ సరైన చర్చ జరగటం లేదన్నారు. పార్టీలో కొనసాగాలంటే అవమాన కరంగా ఉందన్నారు. అందుకే పార్టీని వీడుతున్నామన్నారు. నాగులుప్పలపాడు మండల జడ్పిటిసి డాక్టర్ రత్న భారతి మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి చేద్దామంటే నాయకులు అడ్డుపడేవారున్నారు. ఎమ్మెల్యే ఎస్సీ అయినప్పటికీ ఎస్సీలకు సరైన సహకారం అందించే వారు కాదన్నారు. కేవలం అగ్రవర్ణాల నాయకులు చెప్పిన మాటలే వినేవారు అన్నారు. దళితులకు గౌరవం లేని వైసీపీలో కొనసాగటం అవమానకరంగా భావించి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని పేర్కొన్నారు.

వరద బాధితులకు రూ.50వేల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కృష్ణానది వరద బాధితులకు చేయూతనందించేందుకు మేము ముందున్నామని హనుమంతునిపాడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మరియు మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ తుఫాను వరద బాధితుల సహాయార్థం కొరకు నందనవనం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు కావేటి నారాయణ, పెంచికల రామకృష్ణ, బత్తుల రంగయ్య, చీకటి వెంకట సుబ్బయ్య, మురహరి శ్రీనివాసులు, పరిషపోగు యేసయ్య,ఆకు పాటి శ్రీనివాసులు, పెన్నా గురవయ్య,సూరిశెట్టి శివ, పరిసపోగు రాజేంద్ర, కోవూరి శంకర్,కొప్పు సత్యం,కావేటి సత్యం,షేక్ షఫీ రా,మారంరెడ్డి వెంకటరెడ్డి, పరిసపోగు ఇజ్రాయిల్, గిద్ద గరటయ్య, మోడీ శ్రీను, ఆకుమల్ల నాగ బ్రహ్మచారి, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసి రూ. 50500/- విరాళాలు వసూలు చేసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డికి అందచేయడం జరిగింది.

నేడు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టు కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాలలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలలు, అంగన్వాడి కేంద్రాల్లోని ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు, నేడు అనగా 17వ తేదీ మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు, వైద్యాధికారులు పృథ్వీరాజ్ ఎస్సీ బాలయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాఠశాల లోని విద్యార్థుల చేత నులిపురుగుల నివారణ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. కావున పాఠశాల ఉపాధ్యాయులు తమ పాఠశాల లోని పిల్లలకు విధిగా మాత్రలు మింగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాహ వేడుకల్లో 'బూచేపల్లి'

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలో జరిగిన పలు వివాహ శుభ కార్యాలలో జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గం ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. గంగదేవిపల్లిలో వధూవరులు అల్లూరి చిన్న క్రిష్ణయ్య, మేరీజ్యోతి, వెంకటాపురంలో వధూవరులు జాన్‌వెస్లీ, నిస్సీ, కొచ్చెర్లకోటలో వధూవరులు వినుకొండ శేఖర్ బాబు, ప్రియాంకల వివాహాలకు హాజరై వధూ వరులను అక్షింతలతో దీవించారు. వారి వెంట ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, కర్నాటి ప్రసన్నాంజ నేయరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, చీరాల ఇశ్రాయేలు, తమ్మనేని సుబ్బారెడ్డి, బీమిని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధికల్పనే లక్ష్యం

- దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి
- 18న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-దర్శి : నిరుద్యోగుల ఉపాధికి దారి చూపే కీలక వేదికగా ఎంప్లాయిమెంట్ సెల్ ప్రారంభించామని, వలసలను నివారించి అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఉపాధి చూపడమే లక్ష్యంగా పనిచేస్తామని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి డాక్టర్ శ్రీమతి గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. చదువు మధ్యలో ఆపిన వారు, డిగ్రీ తరువాత ఉపాధి కోసం అన్వేషించే వారికి ఉద్యోగాల కోసం తమవంతు కృషి చేస్తున్నామని ఆమె ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. ఎంప్లాయిమెంట్ సెల్ పేరిట క్యూ ఆర్ కోడ్ లింకులో అభ్యర్థుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటే నిరుద్యోగి అనే గుర్తింపు వస్తుందన్నారు. తద్వారా వారి అర్హతకు తగిన ఉద్యోగం పొందే అవకాశం దక్కుతోందన్నారు. చదువుతో సంబంధంలేకుండా 14 సంవత్సరాలు దాటిన ఎవరైనా ఈ ఎంప్లాయిమెంట్‌సెల్ లో తమ అర్హతల వివరాలను నమోదు చేసుకోవచ్చునని వివరించారు. విద్యార్హత, ఆధార్, కులం, నివాస ధృవపత్రాలతో ఉపాధి అవకాశానికి నమోదు చేసుకోవచ్చన్నారు. దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు ప్రాంతాల్లో చాలా మంది యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇతర దూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని, తమ దృష్టికి వచ్చినట్లు గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. విజయవాడ, వైజాగ్, హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్లి తాపీ మేస్త్రీలు, వర్కర్లుగా పనిచేస్తున్నారని, వీరందరికీ స్థానికంగా ఉపాధి దొరకకపోవడమే కారణమని గుర్తించామన్నారు. ఇలాంటి పరిస్థితులను సరిదిద్ది స్థానికంగానే ఇక్కడి యువతకు ఉపాధి చూపేందుకు ప్రణాళికాబద్ధంగా కొన్ని ప్రముఖ కంపెనీలతో చర్చించి, ఈ ఎంప్లాయిమెంట్ సెల్ రూపొందించామని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వివరించారు. పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి సహకారంతో రాష్ట్ర మంత్రివర్యులు డోలా బాల వీరాంజనేయస్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహాయ సహకారాలతో దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అనేక రకాల ఆలోచనలు చేస్తున్నామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపు శెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, కురిచేడు మండల పార్టీ అధ్యక్షుడు నెమలయ్య, దొనకొండ మండల పార్టీ అధ్యక్షుడు శివ కోటేశ్వరరావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి వాసు పాల్గొన్నారు.

సాహితీవేత్త డాక్టర్ అంకమ్మరావుకు పడవల లక్ష్మణస్వామి పురస్కారం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి, ఆంత్రోపన్యాసకులు, కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ మరియు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్యల అధ్యక్షులయిన డాక్టర్ నూనె అంకమ్మ రావు చేస్తున్న సాహిత్య కృషిని గుర్తించి వారిని ఈ ఏడాది "శ్రీ పడవల లక్ష్మణస్వామి స్మారక స్ఫూర్తి పురస్కారం - 2024"కు ఎంపిక చేసినట్లు "సహజ సాహితి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ" అధ్యక్షులు వదలి రాధాకృష్ణ, పురస్కార ప్రదాత పివిఆర్ ప్రసాద్ లు సంయుక్తంగా తెలియజేశారని, ఈ పురస్కారాన్ని మరియు నగదు బహుమతిని ఈనెల 22వ తేదీన ఆదివారం ఉదయం చీరాల" రోటరీ క్లబ్ సమావేశమందిరం'లో జరిగే సాహిత్య సభలో ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేస్తారని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ, కళామిత్రమండలి ప్రధాన కార్యదర్శి శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయిలు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈసందర్భంగా పురస్కారానికి ఎంపికైన అంకమ్మరావుకు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు, డా సంతవేలూరి కోటేశ్వర రావులు, యు.వి.రత్నం, కె.బాలకోటయ్య, నరసం కోశాధికారి బీరం అరుణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని ముస్లింలు 'మిలాద్-ఉన్-నబీ'గా జరుపుకుంటారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మూడో నెల రబీ-అల్-అవ్వల్‌లో పౌర్ణమి ముందురోజు మహ్మద్ ప్రవక్త జన్మించినట్టు భావిస్తారు. అల్లాహ్... సర్వమానవాళి శ్రేయస్సు, శాంతి నెలకొల్పడం కోసం ఆఖరి ప్రవక్తగా మహమ్మద్‌ను ఎన్నుకున్నట్లు అంతిమ దైవ గ్రంథం పవిత్ర ఖురాన్ షరీఫ్‌లో తెలిపారు. విశ్వ ప్రవక్త మహమ్మద్ కేవలం ముస్లింల కోసమే కాదని సర్వ కోటి జీవరాశులకు, ఈ విశ్వానికి ప్రవక్తగా అల్లాహ్ నియమించారని అందులో పేర్కొన్నారు. విశ్వ ప్రవక్త తాను స్వతహాగా ఏదీ తెలియజేయరని, అల్లాహ్ ద్వారా ఏది వినేవారే అదే తెలిపేవారని నమ్ముతారు. అనేక దైవ గ్రంథాల్లో ఈ విషయాన్ని ముందుగానే వివరించారు.

స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌గా మహిళా న్యాయవాది నంద

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 14, 15వ తేదీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో జరిగినటువంటి 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్-2024 పోటీలలో ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద 2 పతకాలు సాధించారు. కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగంలో బాపట్ల జిల్లా తరపున 76 కేజీల విభాగంలో పోటీపడి బెంచ్ ప్రెస్ నందు గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. అంటే కాకుండా అన్ ఎక్యూపుడు పవర్ లిఫ్టింగ్ విభాగంలో 265 కేజీల బరువును ఎత్తి మరొక రజిత పతకాన్ని తన ఖాతా లో వేసుకున్నారు. మొత్తంగా ఈ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో కుమారి నంద రెండు పతకాలు గెలిచి బాపట్ల జిల్లా తరపున విజయ జెండాని ఎగురవేశారు. అయితే ఈ పోటీలలో కుమారి నందకి ఎడమ చేయి చిన్న పాటి ఇన్జూరి అయ్యినట్లు సమాచారం. పోటీలు జరుగుతున్నప్పుడే మధ్యలో బెంచ్ ప్రెస్ చేస్తున్న సమయంలో చేతికి ఇన్జూరి అయినప్పటికీ పోటీలలో నిష్క్రమించకుండా ఈ పోటీలలో పాల్గొని విజయం సాధించిన కుమారి నంద క్రీడా స్ఫూర్తికి అభినందనలు వెల్లువెత్తాయి. ఇప్పటికే బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ వృత్తి రీత్యా న్యాయవాదిగా సేవలందిస్తూనే కుమారి నంద పవర్ లిఫ్టింగ్ క్రీడ మీద మక్కువతో పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు, ఏల్చూరు గ్రామస్తులు మరియు బాపట్ల జిల్లా క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ పలువురు అభినందనలు తెలియజేశారు.

క్రికెట్ రన్‌రప్‌గా ముండ్లమూరు యూటీఎఫ్ శాఖ

విశాలాంధ్ర-ముండ్లమూరు : జిల్లాస్థాయిలో క్రికెట్ ఆటల పోటీలలో ముండ్లమూరు యుటి ఎఫ్ శాఖ టీం సభ్యులు రన్నర్ విజేతగా నిలిచారు. ఒంగోలులో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ఉద్యోగుల క్రికెట్ పోటీలలో చివర మ్యాచ్లో ఎర్రగొండపాలెం టీం పై ఐక్య ఉపాధ్యాయ ముండ్లమూరు శాఖ టీం ప్రతినిధులు గోగుల కోటేశ్వరరావు, తిరుపతి రెడ్డి, రామకృష్ణ, బ్రహ్మయ్య, గంగాధర్, చాంద్ బాషా, రమణారెడ్డి, శ్రీను, బెన్నీ, శివ, గెలిచి విజేతగా నిలిచారు. దీంతో వీరిని యుటిఎఫ్ శాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓ వీరారెడ్డి, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, జిల్లా క్రీడల కమిటీ కన్వీనర్ అబ్దుల్ హై తెలిపారు.

UNITY Small Finance Bank

యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: సెంట్రమ్‌హౌస్, విద్యానగరి మార్గ్, కలీనా, శాంటాక్రూజ్ (ఇ), ముంబై-400098

లాంఛనప్రాయ స్వాధీనత ప్రకటన
(స్థిర ఆస్తుల కొరకు) రూల్ 8(1) చూడుము

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/ హామీదారులకు కింద పేర్కొన్న తేదీలో డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. సదరు నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా పిలుపునివ్వడమైనది. రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/హామీదారులకు బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు,2002 యొక్క నిబంధన 8తో చదివే పేర్కొన్న చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారుఈ కింద పేర్కొన్న ఆస్తులను స్వాధీన పర్చుకోవడమైనదని రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా ఈ కింద వివరించిన బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీకి గాను **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/హామీదారులను మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. హామీగా పెట్టిన ఆస్తులను విడిపించుకోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్-13, ఉప సెక్షన్ 8 యొక్క నిబంధనల్ని గమనించవలసిందిగా రుణగ్రహీత'లు/సహ-రుణగ్రహీత'లు/హామీదారులను కోరడమైనది.

రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు/ రుణఖా సంఖ్య	హామీగాపెట్టిన/ తనఖా పెట్టబడిన ఆస్తి(లు) వివరాలు	డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి మొత్తం
1. శివ రాఘవేంద్ర టిప్‌టాప్ లాండ్రీషాప్ 2. కోటయ్య సదరబోయిన 3. ముత్యం జాస్మిన్ రుణఖాతా సంఖ్య: **USFBVJWLOAN 000005006452** స్వాధీనత తేదీ: **12/09/2024**	బాపట్ల జిల్లా, ఎంవిపాలెం సబ్ జిల్లా, నిజాంపట్నం గ్రామంలో డి.నం. **405/2ఏ2**, డోర్ నం.**21-132** మరియు అసెస్‌మెంట్ నం.**4132** ఆధారంగా ఉన్న ఆర్‌సిసి భవనంతో **145.2** చదరపు గజాల విస్తీర్ణపు స్థలం యొక్క స్థిర ఆస్తి మొత్తంగా. హద్దులు: (తనాఖా డాక్యుమెంట్ ప్రకారం): తూర్పు: పంచాయతీ సిసి రోడ్డు, పడమర: పంచాయతీ సిసి రోడ్డు, ఉత్తరం: మోహన్‌రావు స్థలం, దక్షిణం: కొంత విస్తీర్ణం పెరిల్ గౌతమికి చెందినది మరియు కొంత విస్తీర్ణం పెరిల్ కృపారావుకు చెందినది. పై సరిహద్దుల పరిధిలో ఆర్‌సిసి భవనంతో పాటు **145.2** చదరపు గజాలు లేదా **121.22** చదరపు మీటర్ల విస్తీర్ణం. ప్లింత్ ఏరియా: ఆర్‌సిసి **294.2** అ॥లు, ఎసిసి **530.66** అ॥లు.	డిమాండ్ నోటీసు తేదీ: **21.05.2024** 18/05/2024 నాటికి రూ. **30,79,200.44/-** (ముప్పై లక్షల డెబ్బై తొమ్మిదివేల రెండు వందల రూపాయల నలభైనాలుగు పైసలు మాత్రమే) + వర్తించబడు వడ్డీ మరియు ఇతర చార్జీలు
1.వెంకటేష్ మోటార్ వైండింగ్ వర్క్స్ 2.కోకిలగడ్డ వెంకటేష్ 3.కోకిలగడ్డ పద్మ రుణఖాతా సంఖ్య: **USFBVJWLOAN 000005006744** స్వాధీనత తేదీ: **12/09/2024**	బాపట్ల జిల్లా, బాపట్ల రిజిస్ట్రేషన్ జిల్లా, మంతెనవారిపాలెం సబ్ జిల్లా, నిజాంపట్నం మండలం, నిజాంపట్నం గ్రామంలో డి.నం. **431/13**, అసెస్‌మెంట్ నం: **972**, కొత్త డోర్ నం.: **5-172** ఆధారంగా ఉన్న ఆర్‌సిసి భవనంతో **96.8** చదరపు గజాల విస్తీర్ణపు స్థలం యొక్క స్థిర ఆస్తి మొత్తంగా. హద్దులు: (తనాఖా డాక్యుమెంట్ ప్రకారం): తూర్పు: పంచాయతీ సిసి రోడ్డు **40** లింకులు, పడమర: పొన్నాడ అంకమయ్యకు చెందిన స్థలం **40** లింకులు, ఉత్తరం: మేడా అర్జునరావు స్థలం **50** లింకులు, దక్షిణం: మోపిదేవి సాంబశివరావు స్థలం **50** లింకులు. పై సరిహద్దుల పరిధిలో ఆర్‌సిసి భవనంతో పాటు **2000** చదరపు లింకులు లేదా **96.8** చదరపు గజాల స్థలం. ప్లింత్ ఏరియా: ఆర్‌సిసి **245** అ॥లు, ఎసిసి **24**అ॥లు.	డిమాండ్ నోటీసు తేదీ: **14.06.2024** 10/06/2024 నాటికి రూ. **20,69,067/-** (ఇరవై లక్షల అరవైతొమ్మిది వేల అరవై ఏడు రూపాయలు మాత్రమే) + వర్తించబడు వడ్డీ మరియు ఇతర చార్జీలు

తేదీ: 17/09/2024
ప్రదేశం: బాపట్ల (ఆంధ్రప్రదేశ్)

సం/- (అధీకృత అధికారి)
యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

కొమరోలు ఎస్సైగా వెంకటేశ్వర నాయక్

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండల నూతన ఎస్సైగా వెంకటేశ్వర నాయక్‌ను నియమిస్తూ జిల్లా ఎస్పీ దామోదర్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో విఆర్‌లో ఉన్న వెంకటేశ్వర నాయక్‌ను కొమరోలు పోలీస్ స్టేషన్‌కు జిల్లా ఎస్పీ బదిలీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్సై మధుసూదన్ రావును కనిగిరి నియోజక వర్గం అయినా వెలిగండ్లకు బదిలీ అయ్యారు. అతి త్వరలో ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ కొమరోలు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

శివాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్

విశాలాంధ్ర- పెద కాకాని : మండల కేంద్రమైన పెదకా కాని శ్రీ భ్రమ రాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ, మేళతాళాలతో స్వాగ తం పలికారు. అనంతరం స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామ వరప్రసాద రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం ఆచరణీయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అల్లాకు ఇష్టమైన చివరి ప్రవక్త ముహమ్మద్ జన్మదినం సందర్భంగా శాంతి ర్యాలీలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మధవి తెలిపారు. సోమవారం మొహిద్దిన్ పాలెంలోని దర్గా వద్ద నుండి ప్రారంభమయిన శాంతి ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కాలనీ నందు గల కడప దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళిని శాంతి మార్గంలో నడిపించటానికి ఎనలేని కృషి చేసి, మానవుడు జీవితం ఎలా గడపాలో నేర్పిన మహోన్నతుడు ముహమ్మద్ ప్రవక్త అన్నారు. మహిళలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి వారి అభ్యున్నతికి ఆయన నిల్చాడని, తల్లి పాదాల కింద స్వర్గం ఉన్నదని ప్రజలకు ఉపదేశించి వారినీ సన్మార్గంలో నడిపారని తెలిపారు.

నిబద్ధత కల నేత కోడెల : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- గుంటూరు సిటీ: టీడీపీకి బలమైన నిబద్ధత కలిగిన నేత కోడెల శివప్రసాద రావు అని ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ శివప్రసాదరావు మంచి మనసున్న డాక్టర్ అని ఎంతో మంది పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్య సేవలు అందించారన్నారు. వైసిపి ప్రభుత్వ వేధింపులకు కోడెల బలయ్యారన్నారు.

క్రీడాకారులకు పతకాలు

విశాలాంధ్ర -తెనాలి : స్థానిక చెంచుపేట లోని యూనిక్ తైక్వాండో క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీలలో కడప జిల్లా శంకరాపురం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో ఆరుగురు క్రీడాకారులు పాల్గొన్నారని యూనిక్ తైక్వాండో అకాడమీ చీఫ్ కోచ్ బట్టు నాగరాజు తెలియజేశారు. నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొని వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభకనబరచారని ఐదు స్వర్ణ, ఒకటి రజత పతకాలు సాధించారన్నారు. ఈ క్రీడాకారులను తెనాలి యూనిక్ తైక్వాండో అకాడమీ గౌరవాధ్యక్షులు అంది బాలచంద్రమౌళి, టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ టెక్నికల్ డైరెక్టర్ గోపినాయుడు, అకాడమీ అధ్యక్షురాలు పి.గీత, కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

జెర్రి వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర- మాచర్ల : రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ సరిగా లేక లిఫ్ట్ ఇరిగేషన్ అటకెక్కిందన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలో ప్రాజెక్టు లకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వ్యవ సాయ రంగాన్ని నిర్వీర్యం చేశాడన్నారు. జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి నిర్వహణ వ్యయాన్ని అంచ నాలు రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సాగు, తాగు నీరందిస్తామన్నారు.

పారిశుధ్య పనులు అమలు ఏది..?

- రోడ్డు వెంబడి చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు
- దోమలతో అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : గాంధీ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తూ పారిశుధ్యానికి పెద్ద పీట వేస్తున్నామని ప్రకటించే అధికారులు ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. అందుకు ఉదాహరణ ముండ్లమూరు మండల కేంద్రంలోని పారిశుధ్య పనులు తూతూ మంత్రంగా నిర్వహించారు. గ్రామంలో బ్రహ్మం చెట్టువద్ద నుండి సింగనపాలెం వెళ్లే రోడ్డులో ఇరువైపులా సైడ్ కాలువలలో పిచ్చి చెట్లు జమ్ముతో పేరుకుపోయిన మురుగు మట్టితో నిండిపోయి ఉంది. కానీ ఆ కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శు భ్రం చేసినట్లు ఫోటోలు తీసుకొని వెళ్లారు. పలుచోట్ల సక్రమంగా నిర్వహించడం లేదని గ్రామ ప్రజల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంతో దోమల సైతం అధిక సంఖ్యలో ఉండడంతో వాటి బారిన పడి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అదేవిధంగా రెడ్ల బజారు నుండి సింగనపాలెం వెళ్లే మట్టి రోడ్డులో చెత్త చదారంతో నడిరోడ్డుపై ఉండడంతో ఆ రోడ్డు మార్గాన్ని వెళ్లే ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే, ఆ రోడ్డు చెత్తాచెదారంతో అపరిశుభ్రత నెలకొంది. పంచాయతీ శాఖ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, ప్రజలను దోమల బారి నుండి కాపాడాలన్నారు.

జనసేన కార్యకర్తలకు అండగా గౌతమ్ రాజు

విశాలాంధ్ర-పెద్దారవీడు : గత కొన్ని రోజులుగా యాక్సిడెంట్ అయి అనారోగ్యంతో బాధపడుతున్న చట్లమడ గ్రామానికి చెందినజనసేన కార్యకర్త జడ్డా వెంకటయ్య ఆరోగ్యం గురించి తెలుసుకున్న జనసేన పార్టీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ పాకనాటి గౌతంరాజు ఆ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని, అనంతరం కుటుంబానికి కావలసిన నిత్యావసర సరుకులు జనసేన నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రటరీ కే.చిన్న పాల్, జనసేన నాయకులు సందీప్, రాజు, యోహాను పాల్గొన్నారు.

పీసీపల్లి ఎస్సైగా కోటయ్య

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి మండల నూతన ఎస్సైగా జి.కోటయ్యను నియమిస్తూ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన టి రమేష్ బాబు మర్రిపూడి మండలానికి బదిలీ అవడంతో పిసిపల్లి మండలానికి ఎస్సైను నియమించలేదు. గత కొన్ని రోజుల క్రితం వీఆర్‌లో ఉన్న జి కోటయ్యను పీసీపల్లి ఇన్చార్జి ఎస్ఐగా నియమించగా సోమవారం జరిగిన ఎస్ఐల బదిలీల్లో భాగంగా జి.కోటయ్యను పిసిపల్లిను రెగ్యులర్ ఎస్సైగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు అసాంఘిక కార్యక్రమాలు జూదం పేకాట అక్రమ మద్యం వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మండలంలో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చునని తెలియజేశారు.

బాధితులకు, అన్న క్యాంటీన్‌కు విరాళం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని అర్ధవీడు మండల టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చేరెడ్డి చిన్న కాశిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి తన వంతు సహకారంగా విజయవాడ వరద బాధితులకు రూ. 5116-00లు, (ఐదు వేల నూట పదహార్లు) గిద్దలూరు పట్టణంలో ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ. 5116-00 లు (ఐదు వేల నూట పదహార్లు) చెక్కుల ద్వారా ఎమ్మెల్యేకి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరాళమిచ్చిన కాశిరెడ్డిని అభినందించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పేకాట ఆడుతున్న పేకాట రాయలను అరెస్ట్ చేసిన సంఘటన మండలంలోని ఎడవల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని ఎడవల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న పెద్ద దోర్నాల ఎస్సై వి.మహేష్, దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 1650 /- నగదును పట్టుకున్నట్టు తెలియజేశారు. పేకాడుతున్న ఏడుగురిపై కేసు నమోదుచేశారు. దోర్నాలమండలంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన పోలీసు వారి దృష్టికి తీసుకురావాల్సిందిగా పెద్ద దోర్నాల సబ్ ఇన్స్పెక్టర్ వి.మహేష్ తెలిపారు. పేకాట శిబిరంపై పెద్ద దోర్నాల ఎస్సై మహేష్, పెద్ద దోర్నాల పోలీస్ సిబ్బంది,దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.

ఘనంగా మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ఒంగోలు : బిజెపి జాతీయ కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మ దిన వేడుకలను ఒంగోలు రాం నగర్ 1 వ లైన్ లో బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విజయా రావు ఫ్లాట్ లో బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి ఘనముగా జన్మ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విజయా రావు మాట్లాడుతూ గత ఎన్నికలలో పార్టీ నన్ను సత్య కుమార్ యాదవ్ విజయము కోసం ధర్మవరంలో పని చేయమని పంపింది అని అప్పటి నుండే సత్యకుమార్ యాదవ్ గారు తెలుసని ఆయనగెలుపు కోసం 25 రోజులు ధర్మవరంలో పని చేయడం జరిగిందని ఆయన గెలవటమే కాకుండా రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రిగా నియమించటం చాలా ఆనందముగా ఉన్నదని తెలిపారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ . యోగ య్యయాదవ్ మాట్లాడుతూ సత్యకుమార్ యాదవ్ తో తనకు 1999 నుండే పరిచయం ఉన్నదని ఆయన వెంకయ్య నాయుడు పిఎ కావటము వలన ప్రకాశం జిల్లాలో ప్రతి బిజెపి కార్యకర్తలను నాయకులను పేరుపెట్టి పిలిచే పరిచయాలు ఉన్నాయని. ఆయన అపర చాణక్యుడు అని. ఒక్కసారి ఆయనతోపరిచయము ఏర్పడితే చాలు ఎన్ని రోజులైనాగాని పేరుపెట్టి పిలిచే జ్ఞాపక శక్తి ఆయన దని అన్నారు. ఈ కార్యక్రమములో డాక్టర్ కొమ్మి నరసింహారావు. బొద్దులూరి ఆంజనేయులు. రాయపాటి అజయ్.మాకినేని అమరసింహ.సీతారామయ్య. తీగల సత్యవతి, పివి కృష్ణా రెడ్డి ఎ అనిల్,కాట్ర గడ్డ శ్రీనివాసరావు,గుత్తుం రంగనాథ్. అల్లరి రామయ్య,మధు యాదవ్,తిరుమల,పెట్లూరి ప్రసాదరావు,పాలపర్తి కమలాకర్, రాజేష్ వర్మ. తానికొండ సురేష్,రమేష్, ధనిశెట్టి రాము,ఉమ్మిడి శెట్టి నాగేశ్వరరావు, శ్రీమతి ధనిశెట్టి పావని. శ్రీమతి అరవింద, శ్రీమతి శ్రీలక్ష్మి, శ్రీమతి తిరుమల.తదితరులు పాల్గొన్నారు.

రోగికి రక్తదానం

విశాలాంధ్ర-అద్దంకి: రక్తహీనతతో బాధపడుతున్న మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కోయిలక్ష్మీకి రక్తం అత్యవసరంగా ఎక్కించాలని వైద్యులు సూచించడంతో రోగి బంధువులు రక్తదాన విభాగ డైరెక్టర్ రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావును సంప్రదించడంతో మురళీ సుధాకరరావు అద్దంకి ఏజీపి రోటేరియన్ యర్రమోతు రమేష్‌ను ప్రోత్సహించి అతని చేత సోమవారం రోగికి రక్తదానం చేయించారు. ఈసందర్భంగా రక్తదాతను రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్-ఉన్-నబి

విశాలాంధ్ర - కొల్లూరు : ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినోత్సవం సందర్భంగా కొల్లూరులోని ముస్లిం సోదరులు సోమవారం మిలాద్-ఉన్-నబీ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మతపెద్దలు ప్రత్యేక ప్రార్ధనల అనంతరం జెండా చెట్టు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు కూడా పాల్గొని మతసామరస్యాన్నికి ప్రతీకగా నిలిచారు.

డాక్టర్ దేవి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - రేపల్లె : ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు రేపల్లె నియోజకవర్గం నగరం మండలం సజ్జావారిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ దేవభక్తుని దేవి (ఎన్ఆర్ఐ) వరద బాధితులను లక్ష విరాళం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్ సోదరుడు టీడీపీ సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

విశాలాంధ్ర - రేపల్లె : గత రెండు నెలల నుండి రేపల్లె నియోజక వర్గంలో ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో బెల్ట్ షాపులు నిర్వహించటం సిగ్గుచేటని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ ఆఫ్ పీపుల్ నేషనల్ కో-ఆర్డినేటర్స్ మండిపడ్డారు. ప్రధానమైన మద్యం దుకాణాల్లో బెల్ట్ షాపులవారికి క్వార్టర్ సీసాపై 20 నుంచి 30 రూపాయలు అదనంగా తీసుకుని బెల్ట్ షాపులు వారికి విక్రయిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని లేనియెడల రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ తరఫున కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిన్ని సాంబశివరావు,కారుమూరు హ్యానోక్ బాబు,జుజ్జువరపు సురేష్,ఉప్పాళ్ళ శ్రీకొండ తదితరులు పాల్గొన్నారు.

భవ్యశ్రీకి అభినందనలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలబెట్టిన పదో తరగతి విద్యార్థిని భవ్యశ్రీని కలెక్టర్ జె.వెంకట మురళి అభినందించారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటీషన్‌లో జిల్లా విద్యార్థినికి జాతీయస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. బాపట్ల జిల్లా కొండమంజులూరు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ రూపొందించిన పోస్టర్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ భవ్యశ్రీకి సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రూ. పదివేల నగదు పారితోషకాన్ని చెక్కు రూపంలో అందజేశారు. విద్యార్థినికి జ్ఞాపికతోపాటు ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఏం చదవాలనుకుంటున్నావు,పెద్దయ్యాక ఏమవుతావని కలెక్టర్ అడిగారు. ఐఏఎస్ చదవాలని అనుకుంటున్నట్లు భవ్యశ్రీ చెప్పగా మరింతగా అభినందిస్తూ తగిన సబ్జెక్టులను ఎలా ఎంచుకోవాలో మార్గనిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను పలకరించి విద్యాభ్యాసం,వారి కుటుంబ నేపథ్యం గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.అనిత, చిత్రలేఖన ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వరరావులను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. నారాయణరావు, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, సికిందర్ మీర్జాన్,రామకోటిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాభిమానులకు బాపట్ల తరగని సంపద

మోదుమూడి సుధాకర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సంగీత సాహిత్య రంగాలలో ఆంధ్ర రాష్ట్రంలో బాపట్లకు ప్రత్యేక స్థాన ముందని,గురు శిష్య పరంపరగా అది నేటికీ కొనసాగుతుండం ఆదర్శ నీయమని ఇక్కడి పౌరులు చక్కని అభిరుచి కావడమే అందుకు కారణ మని ఆకాశవాణి టాప్ గ్రేడ్ సంగీత కళాకారులు మోదుమూడి సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో బాపట్ల జిల్లా రచయి తల సంఘం,శ్రీవాణి కళానికేతన్, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల సంయుక్త నిర్వహణలో సీనియర్ పాత్రికేయులు అచ్యుతుని శంభు ప్రసాద్ రచించిన మనోన్మని గేయ సంపుటి ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కళాభిమానులకు బాపట్ల తరగని సంపద అన్నారు. కళాకారులకు ఇక్కడ లభించే ఆదరణ,ప్రోత్సాహంతో అనేకమంది పద్మశ్రీ అవార్డులను సాధించారన్నారు. నందిరాజు విజయ్ కుమార్ సభాధ్యక్షత వహించిన ఈ సభను భాగి కృష్ణమూర్తి ప్రార్థన గీతంతో ప్రారంభించగా ప్రముఖ రచయిత కోన రమణరావు కావ్యావిష్కరణ చేశారు. ప్రముఖ సభ వ్యాఖ్యాత డి.వి.యం సత్యనారాయణ కావ్య సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆకాశవాణి దూర దర్శన్ గాయనులు భమిడిపాటి లలితా మాధవ్,కొడవటిగంటి హిమ బిందు,అచ్యుతుని రమాదేవి వాగ్గేయకార వైభవం స్వరార్చనలో పలు గీతాలతో సంగీత కచేరి నిర్వహించారు. పాలపర్తి ఆంజనేయులు, ఇంద్రకీలాద్రి శర్మ, బి. సురేష్ బాబు వాద్యసహకారాన్ని అందించారు. బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యామ్ సుందర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలాసం వీరాంజనేయులు అతిధులను స్వాగతించగా రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల కార్యదర్శి వేజెండ్ల శ్రీనివాసరావు,అచ్యుతుని కౌండిన్య,హరిబాబులు పాల్గొన్నారు.

కృష్ణా నది కరకట్టలను పటిష్టం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : కృష్ణా నది కరకట్టలను ప్రభుత్వం పటిష్ట పరచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ సూచించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం లంక గ్రామాల్లో కోతకు గురైన కృష్ణానది ప్రాంతాలను సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు అక్కినేని వనజ,సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్,గుజ్జుల ఈశ్వరయ్య,జిల్లా కార్యదర్శి తన్నీరు సింగర్ కొండలతో పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దశాబ్దాలుగా వరదలు దాటికి లంక గ్రామాలు మునిగిపోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న లంక గ్రామాల ప్రజలు ప్రతి ఏటా వరద ముంపుకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వరదతో లంక గ్రామాల్లో జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి సాయం అందించడంతోపాటు కృష్ణానది కట్టలను దృఢంగా పటిష్టపరచాలని ప్రభుత్వాన్ని కోరారు.

వరద బాధితులకు రియల్ ఎస్టేట్,బిల్డర్స్ అసోసియేషన్ రూ.పది లక్షల విరాళం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల రియల్ ఎస్టేట్,బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు వరద బాధితులకు సహాయార్థం రూ.పది లక్షల చెక్‌ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంచెత్తిన వరదలతో సర్వం కోల్పోయిన బాధిత ప్రజలను మళ్ళీ సాధారణ స్థితికి తీసుకువచ్చి,అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు . విరాళాలు ఇవ్వదలసిన దాతలు సి.ఎం రిలీఫ్ ఫండ్ పేరిట చెక్కు రూపంలో ఇవ్వవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వడ్లమూడి వెంకటేశ్వరావు,గుండ్రెడ్డి శివ, గోపాళం రెడ్డియ్య,నీలం చిన్న బుజ్జి,వీరాస్వామి,ఆర్మి రవి,గోపాళం రామస్వామి, సుబ్బారావు,అంజిరెడ్డి, బాబుల్ రెడ్డి,మురళి,ఉప్పాల వీరా స్వామి పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్వచ్ఛతా హి సేవాలో భాగంగా మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జీఎంసీ ప్రధాన కార్యాలయం, విజ్ఞాన మందిరం, ఎన్టీఆర్ స్టేడియాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమం మంగళవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలు, వార్డు సచివాలయాల్లో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతిజ్ఞ జరుగుతుందని తెలిపారు.

రేవతికి తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారం

విశాలాంధ్ర-వినుకొండ: విజయవాడ బాలోత్సవ భవన్‌లో కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి మరియు తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన సభలో సాహితీవేత్తలు ముఖ్యఅతిథిగా కత్తి వెంకటేశ్వర్లు ఝాన్సీ లక్ష్మీబాయి మనమరాలు శాంతి భాయ్ మరియు నాగరాజు కే నాగేశ్వరరావు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ రాజ్ కుమార్ ఏ నాగరాజు చేతుల మీదగా అమృతపూడి రేవతి కి ఘనంగా పూలమాలలు దృశ్యాలవులతో సత్కరించి నంది పురస్కార పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వినుకొండకు చెందిన జాషువా కవి పుట్టిన గడ్డపై పుట్టిన అమృతపుడి రేవతి మహిళగా కవిత్రిగా సాహితీ మరియు సామాజిక సేవా రంగాలలో విశిష్టమైన కృషి చేసినందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నామని తెలిపారు నంది పురస్కారం అందుకున్న రేవతి కి వినుకొండ పట్టణానికి చెందిన కమలా రామ్ అమృతపూడి విజయరాజు రవీంద్రబాబు మంద వెంకట్రావు ప్రముఖులు రాజకీయ నాయకులు న్యాయవాదులు కవులు కళాకారులు పలువురు అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వేస్టేషన్ ఆధునీకరణ వేగవంతం

- ○రూపురేఖలు మారుతున్న రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- ○ప్రయాణికులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి
- ○జన్మభూమి - కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపాలని ప్రతిపాదనలు

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్ర ప్రభుత్వ రైల్వే మంత్రిత్వశాఖ ప్రకటించిన విధంగా అదర్శ్ అమృత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా గుంటూరు - బాపట్ల జిల్లాలకు అతి చివర డెల్టా తీర ప్రాంతంలో ఉన్న రేపల్లె రైల్వే స్టేషన్ను రూ.25 కోట్లతో ఆధునీకరణ అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.ప్రస్తుతం ఉన్న పాత స్టేషన్ గదులను పూర్తిగా తొలగించి,దాని స్థానంలో ప్రయాణికులకు సకల సౌకర్యాలతో అందుబాటులో ఉండే విధంగా విశ్రాంతి గదులు,టికెట్ కౌంటర్లు,పార్సిల్ కౌంటర్,ఆర్పిఎఫ్ సిబ్బంది కార్యాలయం,దివ్యాంగులకు ప్రత్యేక గదులతో పాటు వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నారు.రైల్వే ప్రయాణికులు ప్లాట్ఫారంపైకి రావడానికి వీలుగా రహదారి మార్గాన్ని ఏటవాలుగా చిన్న మెట్లతో నిర్మిస్తున్నారు. వృద్ధులు, వికలాంగులు,చిన్నపిల్లలు,మహిళలు,స్టేషన్‌లో రైలు బండి దిగిన వెంటనే బయటకు రావడానికి ప్రవేశ ద్వారం ప్రత్యేకంగా అందుబాటులో ఉండే విధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి.ఫుట్ బ్రిడ్జి నిర్మించే పనులు ఇంజనీరింగ్ సిబ్బంది చేపడుతున్నారు.గత కొన్ని నెలలుగా దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు పర్యవేక్షణలో స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి.కొత్త భవనం నిర్మాణం పూర్తి అయిన తర్వాత ప్రస్తుతం ఉన్న స్టేషన్ పాత నిర్మాణాలను తొలగించే చర్యలు చేపడతారు. రేపల్లె రైల్వే స్టేషన్ మోడల్ ఆదర్శ రైల్వే స్టేషన్ గా కేంద్ర ప్రభుత్వం రైల్వే మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది.అందులో భాగంగా రూ.25 కోట్ల ఆధునిక వసతి సౌకర్యాలతో తీర ప్రాంత ప్రయాణికులకు మెరుగైన వసతులు సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో రేపల్లె రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి పరుస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఉన్నత అధికారులు తెలిపారు.దీంతో రేపల్లె రైల్వే స్టేషన్ దశాదిశా మారనున్నది.ఇందుకు సంబంధించి రైల్వే స్టేషన్ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి, దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ టెక్నికల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల కారణంగా కొంత ఆలస్యం అయినప్పటికీని తిరిగి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రేపల్లె టు సికింద్రాబాద్, డెల్టా ఎక్స్‌ప్రెస్ నడుస్తుండగా,రేపల్లె టు వైజాగ్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్,రేపల్లె టు తిరుపతి కృష్ణ ఎక్స్‌ప్రెస్, నడపాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు సంబంధిత రైల్వే అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. కృష్ణ,గుంటూరు,బాపట్ల జిల్లాల రైల్వే ప్రయాణికులు ఈ రైళ్లలో ఈ రైళ్లలో ప్రయాణం చేయటానికి ఆసక్తి చూపుతున్నారు.

దీంతో రైల్వే శాఖకు ఘననీయమైన ఆదాయ వనరులు పెరుగుతాయని రైల్వే ప్రయాణికులు వెల్లడిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో జరిగింది.వివరాల ప్రకారం దేవాంగపురి పంచాయతీ పరిధిలోని వాసవినగర్‌లో నివాసం ఉంటున్న అచ్యుతుని ఫణి కుమార్ (43) సోమవారం ఉదయం పాల ప్యాకెట్లు తీసుకుని వస్తుండగా పల్సర్ బైక్ రాంగ్ రూట్లో వచ్చి ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు.అనంతరం ఆ బైక్ ఆగిఉన్న ఖాళీ ఆటోను గుద్ది పడిపోయింది.బైక్‌ను డ్రైవ్ చేస్తున్న దేవరకొండ రవీంద్ర, బైక్‌పై ఉన్న అక్కల శివ సుందరరెడ్డిలకు గాయాలు కాగా అందరినీ అంబు లెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా ఫణికుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.మృత దేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతుడు స్థానిక ఏఐటీయూసీ నాయకులు అచ్యుతుని బాబూరావు కుమారుడు కాగా చీరాల ఏపీఎస్ ఆర్ టీసీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య,కుమారుడు ఉన్నారు.బంధువుల రోదనలు చూసిన ప్రజల హృదయాలు బరువెక్కాయి.అదుపు చేయలేని వేగంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటనతో ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గణేశుని నిమజ్జనం

విశాలాంధ్ర - యద్దనపూడి : వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను గత తొమ్మిది రోజుల నుండి ఘనంగా జరుపుకున్నాక భక్తులు నిమజ్జనం నిర్వహించారు.మండలంలో పూనూరు,గ్రామంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని నిమజ్జనం చేశారు. స్వామివారికి ఉదయం,సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి,సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి,పదోరోజు గ్రామంలో గణనాథుని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లో గ్రామంలో ఊరేగింపుగా డప్పులు,వాయిద్యాలతో,బాణచంచ,కాలుస్తూ, యువకులు ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈరపనేని వాసు,వంకాయలపాటి సుబ్బారావు, దరువురి వీరయ్య చౌదరి,వరద,బట్టు శ్రీనివాసరావు,వీరస్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహమ్మద్ ప్రవక్త జయంతి

విశాలాంధ్ర - రేపల్లె : ప్రేమ, సహనం,శాంతి, సామరస్యాలను బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో మీలాద్ ఉన్ నబీ పండుగను భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు సోమవారం మహ మ్మద్ ప్రవక్త జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని తూర్పు మసీదు వద్ద నుండి శాంతియుతంగా ముస్లిం సోదరులు పురవీధులలో లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు,అక్కడి నుండి ప్రకాశం రోడ్‌లో భారీ ర్యాలీగా జామియా మసీదు వరకు నిర్వహించారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ ద్విచక్ర వాహనా లపై,లారీలపై,మినీ వ్యాన్లపై జెండాలు చేత పట్టుకొని పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈద్గా కమిటీ పెద్దలు షేక్ జమీర్,మోహిద్దీన్,పఠాన్ సలీం ఖాన్,ఖాదరవల్లి,ఎస్.కె కాలేషా,గౌస్ ఖాన్,బాబావలి,అల్లా బక్షిపటాన్ భాష తదితర మత పెద్దలు ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జయంతిని జరుపుకొని అనంతరం జామియా మసీదు వద్ద సామూహిక భోజనాలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఇళ్లు దగ్ధం

విశాలాంధ్ర-దాచేపల్లి: మండలంలో తక్కెళ్ళపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో ఓ రేకుల ఇళ్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితురాలు పట్టెపు కుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరగడంతో ప్రాణాపాయం తప్పింది. సామాగ్రి అంతా కాలి బూడిదైంది. కట్టు వస్త్రాలతో మిగిలిపోయాం. నేతలతో పాటు ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

కోడెలకు ఘననివాళి

విశాలాంధ్ర-వినుకొండ: ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం కోడెల శివప్రసాద్ ఐదో వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు వారికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ కోడెల శివప్రసాద్ రాష్ట్రం గర్వించదగ్గ నాయకుడని వారు అన్ని శాఖల్లో పని చేశారని చివరగా నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా చేసిన ఘనత వారికే దక్కుతుందని అన్నారు. అలాగే భవిష్యత్తులో వారిని ఆదర్శంగా తీసుకొని మన నియోజకవర్గంలో కూడా జీవీ ఆంజనేయులు వినుకొండను అభివృద్ధి పథంలో నడుపుతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవింద నాయక్, రొడ్డ వీరాంజనేయరెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, పత్తి పూర్ణచంద్రరావు, పెసల వెంకటనారాయణ, వజ్రాల కృష్ణారెడ్డి, సోమేపల్లి శ్రీనివాసరావు, సౌదాగర్ జానీ భాష, భత్తుల గోవిందరాజులు, ఆళ్ల మన్నయ్య, గట్టుపల్లి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్ల రెడ్డి, చికెన్ బాబు, దస్తగిరి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు ఏర్పరచుకోవాలి: అలా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్యార్థినీ, విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని ప్రముఖ సీనియర్ వైద్యులు ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. కష్టాన్ని గుర్తించే నేత్రం-కన్నీటిని తుడిచే హస్తం అంటూ ఏడాది క్రితం ప్రారంభమైన నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జ్ఞాననిధి విభాగాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. గుంటూరులోని రామ కృష్ణ సహకార జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకకు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'అందరికీ విద్య-అందరిదీ బాధ్యత' అనే అంశాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ జ్ఞాన నిధిని ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని కొనియాడారు. నేస్తం చేపట్టిన ఈ మహత్కార్యానికి తమ వంతు కృషిగా రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని జ్ఞాన నిధికి అందజేస్తాన్నారు. విశిష్ట అతిథి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురు నిరక్షరాస్యులలో ఒకరు భారతదేశం నుంచి ఉండటం దురదృష్టకరమన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులను నేస్తం సంస్థ ఆదుకొని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్ మాట్లాడుతూ దాతల ఆర్థిక సాయంతో, సభ్యుల సమన్వయ సహకారాలతో తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందాన్ని కలిగిస్తుంద న్నారు. విద్యార్థుల అవసరార్థం నేస్తం సభ్యులు ఓ కంప్యూటర్‌ను రామకృష్ణ సహకార జూనియర్ కళాశాలకు అందజేశారు. నేస్తం సహ వ్యవస్థాప కులు టి.ధనుంజయ రెడ్డి, రామకృష్ణ సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కన్నారెడ్డి, నేస్తం సభ్యులు జి.రాజేంద్ర కుమార్, కె.సత్యనారాయణ, త్రిపుర సుందరరావు, గోపాల్ పాల్గొన్నారు.

సీఆర్ నగర్‌కు ప్రధాన రహదారి ఏర్పాటు చేయాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు రూరల్ పరిధిలోని చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నగర్‌కు ప్రధాన రహదారిని ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి విజ్ఞప్తి చేశారు. సీఆర్ నగర్ కార్యదర్శుల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఎంపీ గల్లా జయదేవ్ ఎంపీగా ఉన్న సమయంలో సీఆర్ నగర్ ప్రధాన రహదారికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. నగరపాలక సంస్థ అధికారు లు రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపిం చారన్నారు. అనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి నిర్మించకుండా ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. దీంతో ప్రధాన రహదారి సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధికి సీఆర్ నగర్ ఆమడదూరంలో ఉందని అన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ప్రధాన రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. సీపీఐ పోరాట ఫలితంగా సీఆర్ నగర్‌లో విద్యుత్, రోడ్లు, కాలువలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోగలిగామని, అలాగే పల్స్ సర్వే నిర్వహించారని, ఓట్లు సాధించుకోగలిగామని, స్వచ్ఛ భారత్‌లో భాగంగా జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా సుమారు 3 వేల మరుగుదొడ్లు నిర్మించుకోగలిగామని తెలిపారు. కానీ నగరపాలక సంస్థ పాలక వర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని, వెంటనే ప్రధాన రహదారి, సైడ్ రోడ్లు, కాలువలు నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రతిపాదు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు బాధ్యత తీసుకొని సీఆర్ నగర్‌కు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు దేవానాయక్, మౌలాలి, బత్తుల శ్రీను, కాసిం, నక్షత్రం తదితరులు పాల్గొన్నారు.

శివాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్

విశాలాంధ్ర- పెద కాకాని : మండల కేంద్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ, మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామ వరప్రసాద రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం ఆచరణీయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అల్లాకు ఇష్టమైన చివరి ప్రవక్త ముహమ్మద్ జన్మదినం సందర్భంగా శాంతి ర్యాలీలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మధవి తెలిపారు. సోమవారం మొహిద్దీన్ పాలెంలోని దర్గా వద్ద నుండి ప్రారంభమయిన శాంతి ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కాలనీ నందు గల కడప దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళిని శాంతి మార్గంలో నడిపించటానికి ఎనలేని కృషి చేసి, మానవుడు జీవితం ఎలా గడపాలో నేర్పిన మహొన్నతుడు ముహమ్మద్ ప్రవక్త అన్నారు. మహిళలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి వారి అభ్యున్నతికి ఆయన నిల్చాడని, తల్లి పాదాల కింద స్వర్గం ఉన్నదని ప్రజలకు ఉపదేశించి వారినీ సన్మార్గంలో నడిపారని తెలిపారు.

నిబద్ధత కల నేత కోడెల : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: టీడీపీకి బలమైన నిబద్ధత కలిగిన నేత కోడెల శివప్రసాద రావు అని ఎమ్మెల్యే, జిల్లా టీడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ శివప్రసాదరావు మంచి మనసున్న డాక్టర్ అని ఎంతో మంది పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్య సేవలు అందించారన్నారు. వైసిపి ప్రభుత్వ వేధింపులకు కోడెల బలయ్యారన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు దాసరి రాజా మాస్టారు, కంచర్ల శివరామయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు పతకాలు

విశాలాంధ్ర-తెనాలి : స్థానిక చెంచుపేట లోని యూనిక్ తైక్వాండో క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీలలో కడప జిల్లా శంఖరాపురం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో ఆరుగురు క్రీడాకారులు పాల్గొన్నారని యూనిక్ తైక్వాండో అకాడమీ చీఫ్ కోచ్ బట్టు నాగరాజు తెలియజేశారు. నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొని వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభకనబరచారని ఐదు స్వర్ణ, ఒకటి రజత పతకాలు సాధించారన్నారు. ఈ క్రీడాకారులను తెనాలి యూనిక్ తైక్వాండో అకాడమీ గౌరవాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ టెక్నికల్ డైరెక్టర్ గోపినాయుడు, అకాడమీ అధ్యక్షురాలు పి.గీత, కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

వ్యర్థాలు రోడ్లు, డ్రైన్లలో వేస్తే కఠిన చర్యలు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల వెంబడి ఉన్న కొబ్బరి బొండాలు, టిఫిన్, టీ విక్రయదారులు వ్యర్థాలను రోడ్ల మీద, డ్రైన్లలో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టంచేశారు. స్థానిక ఏటి అగ్రహారం, శాంతినగర్, జీటీ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం కమిషనర్ పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వివిధ వ్యాపారాలు చేసే వారు వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేస్తున్నారని, ప్రధానంగా కొబ్బరి బొండాలు డ్రైన్లలో వేయడం వలన మురుగుపారుదలకు అడ్డంకిగా ఉంటుందన్నారు. డ్రైన్లలో మురుగు పారుదల లేకుంటే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ తారని, వర్షాలకు వచ్చే నీరు కూడా ఇళ్ళల్లోకి వస్తుందన్నారు. శాంతి నగర్, సంపత్ నగర్లో స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉండే వార్డ్ సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్దేశిత సమయాల్లో విధుల్లో ఉండాలని ఆదేశించారు. డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ లక్ష్మణ స్వామి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఓ 84 రద్దు చేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేస్తూ విడుదల చేసిన జీఓ 84ను రద్దు చేయాలని ఎస్టీయూ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు అన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జీఓ వల్ల మున్సిపల్ ఉపాధ్యాయులకు మున్సిపల్ స్కూల్స్‌కి ఎటువంటి ఉపయోగం లేకపోగా తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. గత నాలుగేళ్లుగా బదిలీలు పదోన్నతులు జరగలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి వెంటనే బదిలీలు పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ డిమాండ్ చేస్తోందన్నారు. మొన్న జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో మున్సిపల్ హైస్కూల్ పోస్టులు భర్తీ చేశారని అన్నారు. వారిని వెనక్కి పంపి మున్సిపల్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. నేడు జరిగే స్కూల్ కాంప్లెక్స్‌లు విలీనంలో మున్సిపల్ పరిధిలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లను స్కూల్ కాంప్లెక్స్‌లుగా తప్పించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు అప్పగించడాన్ని ఎస్టీయూ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు వెంటనే స్పందించి స్కూల్ కాంప్లెక్స్ లిస్ట్‌లో మున్సిపల్ హైస్కూల్‌ను కాంప్లెక్స్‌లుగా యధావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల పట్ల వివక్షను విడనాడి ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ఏర్పాటు చేయాలని, బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని అన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్లాన జయప్రకాష్, షేక్ జమీర్ బాషా, షేక్ ఫరిశా, ఎస్.కాలేషా, ఇనకొల్లు అంకమ్మరావు, ఎం.చిన వెంకటస్వామి, కుంభా ఏడుకొండలు, పి.సాగర్ బాబు, కె.సోమ్లానాయక్, అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుకూలంగానే వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ చట్టాలు

మైనార్టీ కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా ముస్లిం సామాజికవర్గం తీవ్ర ఆందోళన చెందుతుందని , వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ వాటి బాధ్యత ఇప్పుడున్న చట్టాలు అనుకూలంగానే ఉండాలని గుంటూరు జిల్లా మైనార్టీ కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో గుంటూరు జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ గని ఆధ్వర్యంలో మైనార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. త్వరలో జరగబోయే కృష్ణ గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మైనార్టీలకు అవకాశం కల్పించాలని అన్నారు. కృష్ణ గుంటూరు జిల్లాల్లో మైనార్టీల పట్టభద్రుల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని... మైనార్టీలకు అవకాశం కల్పించాలని తీర్మానించారు. గుంటూరు మిర్చియార్డు చైర్మన్ తెలుగుదేశం పార్టీ ఈసారి మైనార్టీలకు కేటాయించాలని, ఇంతవరకు మైనార్టీలకు చైర్మన్ అవకాశం కల్పించలేదని... ఈసారి మైనార్టీలకు అవకాశం కల్పించాలని మైనార్టీ కార్యవర్గ సభ్యులందరూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ రుస్తుంబాబు, మీరా సాహెబ్, షేక్ రఫీ, షేక్ బాజీ, షేక్ జిలాని, మహమ్మద్ రఫీ, మహమ్మద్ బాషా, ఫిరోజ్, షేక్ జాన్ సైదా, ఎస్.ఎం ఇల్లాహి, పర్వేజ్, ఖాదర్ బాషా, షేక్ ఇర్ఫాన్, షేక్ మహబూబ్ జానీ, షేక్ సర్దార్, షేక్ జాన్ సైదా, షేక్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీసీల కులగణన జరపాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జాతీయస్థాయి జనగణనతో పాటే సమగ్ర కుల గణనను జరపాలని, బీహార్‌లో కులగణన చేసి రిజర్వేషన్లు కల్పించిన విధంగానే అదేవిధంగానే ఆంధ్రప్రదేశ్ కూడా బీసీ కుల గణన చేపట్టి బీసీల జనాభా మేరకు రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు బక్కా పరంజ్యోతి డిమాండ్ చేశారు. బీసీ జనగణన అంశంపై బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ సామాజిక అసమానతలు తొలగిపోవాలంటే బీసీ కులగణనే పరిష్కార మార్గమని అన్నారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 9వ తేదీన విజయవాడలో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించబోతున్నట్టు తెలిపారు. ప్రముఖ లాయర్, బీసీ నాయకులు వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రతి పౌరుడు చెప్పిన కులం పేరును జన గణనతో పాటే ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. బీసీ జగగణనను వేగవంతం చేసి అర్హులకు మాత్రమే రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు, గుంటూరు జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు, పీవీ రమణయ్య, బీఎస్పీ నాయకులు తెనాలి ప్రకాష్, డొక్కా జగన్మోహనరావు, ఎస్.బాబురావు, డాక్టర్ మురళీధర్, సీనియర్ జర్నలిస్ట్ చలపతి రావు, బీసీ నాయకులు నరసింహారావు, మాల్యాద్రి, కోటేశ్వరరావు, విజయలక్ష్మి, వాసులు పాల్గొన్నారు.

జెర్రి వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర- మాచర్ల : రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ సరిగా లేక లిఫ్ట్ ఇరిగేషన్ అటకెక్కిందన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలో ప్రాజెక్టు లకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వ్యవ సాయ రంగాన్ని నిర్వీర్యం చేశాడన్నారు. జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి నిర్వహణ వ్యయాన్ని అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సాగు, తాగు నీరందిస్తామన్నారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ ప్లాంట్ భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సాధించడంతో పాటు, నియోజకవర్గంలో అవసరమైనచోట్ల పంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకుంటామని తెలిపారు.

'హంజా అలీ' విజయాలు సాధించాలి: షమ సుల్తాన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి సమాజానికి మంచి మెసేజ్ ఓరియంటెడ్ సినిమా తీసి అందరి మన్ననలు పొందుతున్న హంజా అలీ నా సోదరుడు కావడం చాలా గర్వకారణంగా ఉందని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీ ఎస్)ఉమెన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. హంజా అలీ భవిష్యత్తులో మరిన్ని సినిమాలు తీసి విజయాల పొందాలని ఆకాంక్షిస్తూ.. హోప్‌విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక ఐటీసీ వెల్కమ్ హోటల్ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె 'పేకమేడలు' చిత్రం ఎడిటర్ అండ్ స్క్రీన్‌ప్లే రైటర్ అయిన హంజా అలీకి 'అప్రిసియేషన్' అవార్డు ఇచ్చి శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వ్యక్తి లక్ష్యం దిశగా పని చేస్తే విజయం వర్ధిస్తుందనడానికి హంజా అలీ నిదర్శనమన్నారు. మద్య పానం వ్యసనానికి గురై తమ కుటుంబాన్ని పట్టించుకో కుండా తిరుగుతున్న వాళ్లకు 'ఐ ఓపెనర్'గా పేకమేడలు సినిమా నిలుస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ షమ సుల్తానా కుటుంబ సభ్యులు, హంజా అలీ కుటుంబ సభ్యులు, హోవిన్ హాస్పిటల్స్ సభ్యులు, సినిమా రంగ అభిమానులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో చీరాల యువత సత్తా

విశాలాంధ్ర - చీరాల : సెప్టెంబర్ 15వ తేదిన ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో చీరాలకు చెందిన కుర్రాళ్ళు సత్తాచాటారు. 55 కేజిల విభాగంలో తలపడి చీరాల మండలం పాత చీరాలకు చెందిన సూరిన భాస్కర్ రెడ్డి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోగా, 50 కేజిల విభాగంలో చీరాల మండలం పాత చీరాలకు చెందిన మేరుగు కిషోర్ 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.తమ విజయానికి దోహదపడిన ఫిట్‌నెస్ జిమ్ ట్రైనర్ గుమ్మడి బూన్‌కు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - చీరాల : పేదవాడి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం విరాళాలు ఇవ్వడం సంతోషదాయకమని మంచి పని చేస్తే ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని అనడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వడమే నిదర్శనమని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు.సోమవారం ది చీరాల బులియన్ జ్యూవెలరీ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ నిర్వహణకు లక్ష రూపాయలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయ్యాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారని, అన్నా క్యాంటీన్ ఎంత గొప్ప కార్యక్రమమో ప్రజల నుంచి వస్తున్న మద్దతు చూస్తే అర్థమౌతుందన్నారు. అన్నా క్యాంటీన్ నిర్వహణకు మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ది చీరాల బులియన్ జ్యూవెలరీ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ సురేష్ బాబు,సెక్రెటరీ వర్ధికల నాగేశ్వరరావు,ట్రెజరర్ బి.స్వామి,జాయింట్ సెక్రెటరీ ఊటుకూరు సత్యనారాయణ,గుడిమెట్ల కృష్ణమోహన్,రామకృష్ణ,వాసు పాల్గొన్నారు.

ఘనంగా జష్ నె ఈద్ మిలాద్-ఉన్-నబి

విశాలాంధ్ర - వేటపాలెం : జెష్ నే ఈద్ మిలా-దున్-నబి పండుగ సందర్భంగా వేటపాలెంలో సోమవారం ఘనంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమము నకు ముఖ్య అతిథులుగా ఖతిబె అహెలె సున్నత్ మౌలానా ముఫ్తీ,మెహమ్మద్ హబిబుల్ల రజ్వి సాబ్,గుల్షనె రజా చీరాల,అషిఖ్ రజా,చీరాల మౌలానా అల్లా ఉద్దీన్ రజ్వీ ముబారక్ మస్జిద్ ఇమామ్,విస్వ గురువు,మానవ మహెపకారి,మహ ప్రవక్త ముహమ్మద్ ముస్తఫాలు పాల్గొన్నారు.సోమవారం అతి పవిత్రమైన మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు అని,ఇది ఎంతో పవిత్రమైన రోజు అని హిందూ ముస్లింలు అంతా కలిసి ఈ పండుగ జరుపుకుంటారని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ మహమ్మద్ ప్రవక్త ముఖ్య ఉద్దేశం అన్నారు.ఈ కార్యక్రమంలో ఆబాద్ నగర్,సుబాని మష్ కూరి,షఫి వుల్లా,అన్వర్ బేగ్,ఖరహమద్,రహంతుల్లా,రఫీ, మౌలానా బేగ్,ఆస్థాన ఎ మష్ కూరియా శిష్య బృందం,ముబారక్ మస్జిద్ ముతవల్లి సయ్యద్,జునైద్,హనిఫ్ సాబ్,మాబుజాని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

దళిత గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే కొండయ్యకు దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సభ్యుల వినతి

విశాలాంధ్ర - చీరాల : దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో త్వరలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఎస్సీ,ఎస్టీ కంపోనెంట్ కింద వివిధ పథకాలకు నిధుల కేటాయింపుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్యను వివిధ ప్రజాసంఘాల నేతలు కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెస్ చార్జీలు పెంపుదల చేసి సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు.దరఖాస్తు చేసు కున్న ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించే విధంగా నూతన గురుకుల పాఠశాలలు నిర్మించాలని,పీజీ విద్యార్థులకు స్కాలర్షిప్‌లు మంజూరు చేయాలని కోరారు.గత ప్రభుత్వం రద్దు చేసిన దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అమలుకి వెంటనే చర్యలు చేపట్టాలని,ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల ప్రజలు సైతం అర్హులుగా మార్పులు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.సఫాయి కర్మచారి గిరిజనులు డీ-నోటిఫైడ్ ట్రైబ్స్,డిఎన్టిలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని,పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేద దళిత గిరిజనులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని,దళిత గిరిజన వార్డులకు స్మశాన స్థలాలు కేటాయింపులకు నిధులు విడుదల చేయాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే కొండయ్యకు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు.ఈ కార్యక్రమంలో బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ దేవరపల్లి డేవిడ్ రాజ్, కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు,దళిత బహుజన రిసోర్స్ సెంటర్ చీరాల,బాపట్ల ఏరియా కో-ఆర్డినేటర్ ఎన్.భగవాన్ దాస్,శ్రీలత,గుమ్మడి ఏసురత్నం,ఎన్.లక్ష్మీ నరసయ్య,బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు నల్లమల తిరుపతిరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సీపీఐ,ఏఐటీయూసీ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సోమవారం జరిగిన రోడ్డు ప్రమాద దుర్ఘటనలో మరణించిన అచ్యుతుని ఫణి కుమార్ భౌతిక కాయాన్ని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు,డిపో అధికారులు, కార్మికులు చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలోని వాసవి నగర్‌లో ఉన్న గృహంలో సందర్శించారు.పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ మితి మీరిన వేగంతో వాహనాలు నడిపితే జరిగే పార పాటుకు కుటుంబాలు ఇబ్బంది పడవలసి వస్తోందని అన్నారు.వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఏఐటీయూసీ నాయకులు అచ్యుతుని బాబూరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కౌన్సిల్ సభ్యులు మేడా వెంకట్రావు,ప్రకాశం జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు,సీపీఐ సీనియర్ నాయకులు ప్రకాశం జిల్లా నాయకులు ఎస్‌డి సర్దార్,చీరాల మండల కార్యదర్శి వీరాంజనేయులు, వేటపాలెం సీపీఐ మండల కార్యదర్శి డి.వెంకటేశ్వర రెడ్డి,చీరాల పట్టణ కార్యదర్శి రాజశేఖర్,చీరాల సీపీఐ నాయకులు కార్యదర్శి సిహెచ్ ప్రకాష్ బాబు, సాంబశివరావు దుర్గాప్రసాద్,శివప్పన్నారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బాసి పైడయ్య, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి మురళి,రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెవి రావు, కార్యదర్శి వాసులు,సీపీఐ శాఖ కార్యదర్శి రమేష్,చీరాల డిపో కార్మికులు తదితరులు భౌతిక కాయాన్ని దర్శించి నివాళులు అర్పించారు.

సమాజ సేవకులు ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - నిజాంపట్నం : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని ఎంఈఓలు 1,2 సురేష్,శేషు గోపాలం అన్నారు. మండలంలోని బాలవారిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న తోటకూర పద్మావతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం నిజాంపట్నంలో ఆమెకు అభినందన,సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్షులు మోపిదేవి తులసీదాస్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా ఎంఈఓలు సురేష్,శేషు గోపాలం హాజరై మాట్లాడారు. విద్యార్థులకు జ్ఞానమనే వెలుగును పంచే సమాజ సేవకులు ఉపాధ్యాయులన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది వారి జీవితానికి సార్థకత తీసుకువచ్చే ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైనదన్నారు.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పద్మావతి ఎంతో నిబద్ధతతో తన 41 సంవత్స రాల సర్వీసులో ఎందరో విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందిస్తూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. రిటైర్డ్ ఎంఈఓ కె.హరిబాబు, ప్రజ్ఞం జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం కొలసాని రమేష్, జిల్లా ఎస్టీయూ నాయకులు బడుగు శ్రీనివాస్, గుడివాడ అమర్నాథ్, ఏపీటీఎఫ్,యూటీఎఫ్, పీఆర్టీయు సంఘాల బాధ్యులు,మండలంలోని ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత పద్మావతి దంపతులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

వైభవంగా స్వామి కల్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని చెరుకూరులో వేంచేసియున్న శ్రీ అగస్త్యేశ్వర, త్రివిక్రమ స్వామి దేవస్థానం పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్య కహోం కార్యము, హోమం జరిగాయి.స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.స్వామివారి కల్యాణము సందర్భంగా చెరుకూరు గ్రామ మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి,రామకృష్ణ దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు.భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదములు అందించారు. తిరుపతి నుంచి శ్రీ భవనారాయణ స్వామివారి బృందం కళ్యాణత్యం అత్యంత అద్భుతంగా కనుల విందుగా జరిపించి ఉన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య ఏర్పాట్లు చేశారు.

ఎండు గడ్డి పంపిణీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో వరద ముంపుకు గురైన బాధితులకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో చినమట్ల పూడి టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా బాసటగా నిలిచారు.వరదల ప్రభావంతో లంక గ్రామాల్లోని పశువులకు మేత లేక అల్లాడిపోతున్నాయని భావించి మానవతా దృక్పథంతో షేక్ కరిముల్లా తనవంతుగా వంతుగా రెండు ట్రాక్టర్ల ఎండు గడ్డి పంపిణీకి ఏర్పాటు చేశారు.ఈ మేరకు సోమవారం నగరం మండలం చినమట్లపూడి గ్రామం నుంచి పశు సంవర్ధక శాఖ ఏడి నాంచారాయ్య, నగరం మండల టీడీపీ ఇన్‌ఛార్జి గుడారంకయ్యల సమక్షంలో జెండా ఊపి రెండు ట్రాక్టర్ల ద్వారా ఎండు గడ్డిని రవాణా చేశారు. టీడీపీ బృందం అబ్దుల్ జలీల్, జల్లు సాహెబ్, అయూబ్ అలీ, అబ్దుల్ జలీల్,షేక్ వహేదుల్లాలు పాల్గొన్నారు.